# 2. స్థల పురాణం

వాసు ఉత్తరం రాసేడు, హైద్రాబాద్ నుంచి! తనకి విశాఖపట్నానికి ట్రాన్స్ఫరైందిట. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫీసులో పెద్ద ఉద్యోగం. ఇళ్ళస్థలాలకి లే ఔట్లు వేయించి ప్లాట్లు చేయించి ప్లాన్లు గీయించడమే కాకుండా ఆయా ప్లాట్లలో జనం ఇళ్లు కట్టుకునేటందుకు ప్లాన్లు పంపిస్తే వాటిమీద (ఆమోద) "ముద్ర" వెయ్యడం కూడా అతని అధికారాల్లో వొకటి. కింది ఉద్యోగులు ఇలాంటి సందర్భాల్లో ఏమీ "తినకుండా " యమ కాపలా కాసేస్తాడని అతనికి గొప్ప పేరు. కింది ఉద్యోగాల్లో వాళ్లు ఏమీ "తినకుండా" చూస్తాడన్న మాటే కాని అతనేమీ తినకుండా ఉండడనీ, ఎక్కడ లేందీ అతనికే చాలనందువల్లనే వారిపట్ల అలాంటి పద్ధతి అవలంబిస్తాడనీ, తన దారికి అడ్డు వచ్చే వాళ్లని "తినేస్తాడని" అతనిమీద కొందరు చేసిన దుష్ ప్రచారం నాదాకా వచ్చింది.

కాని వాసు నాస్నేహితుడు. అతన్ని ఎవరైనా ఏమైనా అంటే నేను నిమ్మకి నీరెత్తినట్టు ఊరుకోకూడదు. అంచేత లోకులు (లోకువ కట్టడానికి వీలయ్యే వాళ్లు) ఏమనుకున్నా సరే నేను సాధ్యమైనంత వరకూ అతని పక్షమే వాదిస్తూ ఉంటాను. 'నేను సర్వీసులో ఉండగా ఏదో ఒక ముఖ్యమైన నగరంలో నువ్వు ఇల్లు కట్టుకోవడానికి నీకో మంచి ప్లాటు ఇప్పిస్తాను" అని అతను నాకు వాగ్దానం చేసిన మాట నిజమే. కాని నేను అతనిని వెనకేసుకు రావడానికి కారణం ఈ వాగ్దానం ఒక్కటే కాదు. ఒట్టి వాగ్దానాలకి ఎవరైనా ఎవరినైనా వెనకేసుకొచ్చే రోజులు పోయాయికద. అతని వాగ్దానం పట్ల నాకు ఉన్న దుర్భేద్యమైన నమ్మకమే దీనికంతటికీ కారణం.

అలాంటి వాసు విశాఖపట్నానికి ట్రాన్స్ఫరై వొస్తున్నాడంటే నాలో మళ్ళీ ఆశ చిగిర్చింది. ముప్ఫయి ఏళ్ల బట్టీ ఈ వూళ్లో ఉద్యోగం చేసుకుంటున్నాను. 1957లో కాబోలు, నాకు మొదటిసారిగా ఈ వూళ్లో ఒక స్థలం సంపాదించి రెండు గదులు వేసుకుంటే బావుండునని కోరిక పుట్టింది. ఆ రోజుల్లో. "దొండపర్తి ఏరియాలో గజం పావలా చొప్పున కొనిపెడతాను, నాలుగు వందల గజాల స్థలానికి నూరు రూపాయిలు ఖరీదు కిందా, పాతిక రూపాయిలు ఖర్చుల కిందా ఇయ్య"మని ఈ వూరి మునిసిపాలిటీలో పనిచేసిన ఒకాయన అడిగాడు. ఆనాడు నా జీతం నెలకి అరవైరెండు రూపాలుండేది. రెండు నెలల జీతంతో ఇంటి స్థలం వస్తోంది కదా అని, తలో మొలో తాకట్టుపెట్టి అప్పుతెచ్చి ఇచ్చేద్దామని నిశ్చయించుకుని, ఆ ఆనందం మా ఆవిడతో పంచుకోవడానికి ప్రయత్నించడంతో వ్యవహారం బెడిసికొట్టింది.

"గజం పావలాకి భూమేమిటి? చెప్పిన వాడికి బుద్ధి లేకపోతే మీ బుద్ధి ఏమైంది? భూమి సంగతి దేవుడెరుగు, గజం పావలా చొప్పున మంచి శాటిన్ రిబ్బన్ ఇప్పించమనండి చూద్దాం! అని మా ఆవిడ క్లాసు పెట్టింది. (జడకి రిబ్బను కట్టుకునే) వయసులో ఉన్న భార్య మాటలు వ్యవహారం చేసేవాడు వినకూడదని తెలియక మోసపోయాను. మోసం అని ఎందుకంటున్నానంటే ఆ తరువాత కొన్నాళ్ళకి తెలిసింది, దొండపర్తి ఏరియాలో అప్పట్లో గజం పావలా చొప్పున

స్థలాలు నిజంగానే అమ్మేరని.

అప్పుడు అలా చాలించుకున్న స్థల పురాణం నన్ను శాశ్వతంగా వెంటాడుతూనే వుంది. అలా వెంటాడుతున్నట్టు మిత్రుడు "వాసు"కి తెలియగానే నాకు అతను ఆ వాగ్దానం చేసేడు.

ఆ తరువాత పదేళ్ళకి, నాజీతం మూడు వందల తొంభై రూపాయిలు ఉన్నప్పుడు, నా ప్రావిడెంట్ ఫండ్ నిలవ పన్నెండు వందలు దాటినప్పుడు, నేను అద్దెకుంటున్న ఇంటి ఓనరు; కూతురికి పెళ్ళికుదిరిందని, పెరటి వైపు జాగా నాలుగు వందల గజాలు అమ్మేస్తున్నానని చెప్పి, కొనుక్కోమని నాకు సూచన చేసేడు. కాని, ఏకంగా గజం ఇరవై రూపాయిల ధర చెప్పాడు. అంటే ఎనిమిది వేలు కావాలి!

మళ్లీ 1974లో, నాకు స్థలం కొందామన్న దుర్బుద్ధి పుట్టింది. ఎందుకంటే, నాజీతం నెలకి వెయ్యిరూపాయలైంది. నాప్రావిడెంట్ ఫండ్ నిలవ ఎనిమిది వేలు దాటింది. కాని, స్థలం వెల (ఊరికి కాస్త దగ్గర్లో వుంటే) గజం డెబ్భై రూపాయిలు చెప్పేరు. ఊరికి ఐదారు కిలోమీటర్ల దూరంలో అయితే గజం యాభై దాకా చెప్పేరు. "నాలుగువందల గజాల స్థలం ఎందుకు మనం ఇల్లు కడతాం గానీ తోట వేస్తామా? రెండు వందల యాభై గజాలు చాలు" అనుకున్నా - నాప్రావిడెంట్ ఫండ్ అంతా తీసుకోవాలి, జీతం కూడా ఓ పది నెలలది అడ్వాన్స్ తీసుకోవాలి. రెండూ అయ్యేవి కాదు. అప్పటికి ఆ ఆశ అలా సన్నగిల్లిపోయింది.

ఆ తరువాత ఇక మన స్థలం ఊరికి దూరమా దగ్గిరా అనే మీమాంస వదిలేసి, "అసలెక్కడో ఓ చోట స్థలం అంటూ దొరికితే" అన్న ధోరణిలో ఆలోచించినా, ఎక్కడ లేని స్థలాలూ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు గజం ముప్పయి, నలభై చొప్పున కొని వాళ్ల ఆఫీసు కట్టుకున్నందుకు, ఉద్యోగుల జీతాలు అవీ ఇస్తున్నందుకూ ఇంకా ఇతరేతర సౌఖ్యాలు ఎందరికో సమకూరుస్తున్నందుకూ లెక్కలు వేసుకుని గజం నూటయాభై చేసి అమ్ముతున్నారని, నలభై వేల రూపాయలుంటే తప్ప స్థలం అంటూ లభ్యం కాదని అర్ధమైంది. ఈ మధ్యకాలంలో మూడుసార్లు వేతన సంస్కరణలొచ్చాయి. ఇప్పుడు నా నెల జీతం రెండు వేల రెండు వందలు. ప్రావిడెంట్ ఫండ్ ఇరవై అయిదు వేలుంది. జీతం పది నెలలది అడ్వాన్స్ ఇమ్మంటే ఇయ్యరుగానీ, ఇరవై ఏళ్లకి పైగా సర్వీసు చేసినందువల్ల ప్రావిడెంట్ ఫండ్ లోంచి ఇరవై వేలు కావాలంటే మళ్ళీ జమకట్టక్కర్లేని పద్ధతి మీద ఇచ్చేస్తారు. ఐనా ఇవాళ సిటీకి ఇరవై కిలోమీటర్ల దూరంలో కూడా అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ వారి రేటు గజం మూడు వందల రూపాయిల దరిదాపుల్లో ఉంది. అంటే, రెండు వందల అరవై గజాల స్థలానికి (అంతకంటే తక్కువకి నా జీతం ప్రకారం నాకు అర్హత లేదుట)ఎనభై వేల రూపాయలు కావాలి.

ఇలా, నా ఎదుగుదల కొత్తిమీర మొక్కలాగ పెరిగినా స్థలాల రేట్ల పెరుగుదల కొబ్బరి మొక్కలాగ జరిగి పోతూంది.

"నువ్వేమీ అధైర్య పడకు. నేను నీకు లోగడ ఇచ్చిన వాగ్దానం నీకు గుర్తుందో లేదో గాని నాకింకా గుర్తుంది. మంచి వాళ్లు ఏదైనా వాగ్దానం చేస్తే అది నెరవేర్చి మరీ మరచిపోతారు. చెడ్డవాళ్లు వాగ్దానం చేసి వెంటనే మరచిపోతారు. నీ కెలాగయినా సరే ఒక ప్లాటు ఇప్పించి నేను మంచివాడినే అని రుజువు చేసుకొనే సమయం వస్తోంది." అని మిత్రుడు వాసు తన ఉత్తరంలో రాశాడు.

హైదరాబాద్ లో విజయనగర్ కోలనీ అని ఒకటుందిట. ఆ కోలనీకి ముప్ఫయ్యేళ్ళనాడు వేసిన లే ఔట్ లో "పార్కు" గా వదిలేసిన స్థలం ఇటీవల ఒక పెద్దమనిషికి ఎసైన్‌మెంట్ చేయించి దాన్ని స్థలాలుగా విభజించి లే ఔట్ వేయించి ఆ స్థలాలన్నీ, నాబోటి వాళ్లకి అమ్మించిన ఖ్యాతి నా మిత్రుడు వాసు దేనని నాకు భోగట్టా తెలిసింది. అలాగ ఈ వూళ్లో కూడా చెయ్యగలిగితే నాకు స్థలం ఇప్పించ గలగడం అతనికి లెక్కలో పని కాదు, అని నాకు నేను ధైర్యం చెప్పుకున్నాను.

నా ఐడియా రైటేనని అతనిక్కడ ఛార్జీ తీసుకున్ననాడే తెలిసింది. ఆ సాయంకాలం నాకు కబురుపెట్టాడు. వెళ్లాను.

"నగర జీవితం మనిషిని యంత్రంగా మారుస్తూంది. పగలంతా ఆఫీసులోనో, ఫ్యాక్టరీలోనో పనిచేసి అలిసిపోయి ఇళ్లు చేరుతున్నారే గాని, జనం, పార్కులో పది నిమిషాలు గడపడానికి ఉత్సాహం చూపించ లేకపోతున్నారు. ఏమంటావు?" అన్నాడు.

"కరెక్ట్. సాయంకాలం అయ్యేసరికి ఎప్పుడు ఇంటికి పోదామా, ఎప్పుడు టీవీ ఎదురుగా వాలుదామా అని ఆందోళన పడుతున్నామే తప్పా పార్కులో కాసేపు కూర్చుని వెడదాం అని ఎవరికీ అనిపించడం లేదు; నిజమే"అన్నాను.

"అంచేత ఈ వూళ్లో పార్కులన్నిటినీ స్వాధీనం చేసుకొని లే ఔట్లు వేసి ఆ స్థలాలన్నీ నీలాంటి వాళ్లకి ఇప్పించేద్దామని సూచన చేస్తున్నాను" అన్నాడు వాసు.

"ఐతే నాకు డైమండ్ పార్కులోనో, సరస్వతీ పార్కులోనో చిన్న జాగా చూసిపెట్టు, నీకు పుణ్యం ఉంటుంది!" అని ప్రాధేయపడ్డాను.

"అలాంటి చిన్న చిన్న పార్కులు మనకెందుకు? నాదృష్టి అంతా పెద్దపెద్ద పార్కుల మీద ఉంది!"

"నేను చెప్పినవి చిన్నపార్కులే అనుకో. కాని ఇంకా పెద్ద పార్కులు ఉన్నాయా? నాకు తెలీదే! నువ్వు ఈ వూరి ప్లాన్ అంతా క్షుణ్ణంగా పరిశీలించి వుంటావు గనుక నీకు తెలిసిపోయి వుంటుంది. ఎలాగైనా బుర్రంటే నీదే సుమా!" అని వాసు తెలివిని యధాశక్తి మెచ్చుకున్నాను.

"మరేమనుకున్నావు! హార్బరు పార్కు ఇరువై ఆరు ఎకరాలు. యారాడ పార్కు ముప్పయ్యెకరాలు, ఇంకా వాల్టేరు పార్కు వందెకరాలు. నేవల్ పార్క్, అమ్-జరి పార్కు కలిసి ముప్ఫయిమూడు ఎకరాలు. ఇంకా పల్లవ పార్క్, వరుణా పార్క్ ఇలా బోలెడున్నాయి. నువ్వు ధైర్యంగా ఉండు" అన్నాడు.

నాకు కాసేపు నోట మాట రాలేదు. అయినా నిజం చెప్పి అతన్ని ప్రోత్సాహ పరచడం మంచిదని, చిన్న తిరుగుడుతో చెప్పేను: "అవన్నీ ఎలాగా కుదరవు గాని, 'జూపార్కు' సంగతి చూడు. ఎలా లేదన్నా అయిదారు వందల ఎకరాలుంటుంది. దెబ్బకి కరువు తీరుతుంది" అన్నాను.

"కాని, అది జంతువుల కోసం కదా?" అన్నాడు వాసు.

"మరి మేం అంతా ఎవరం అని, నీ ఉద్దేశ్యం?" అని, వెంటనే లేచి వచ్చేశాను. ★

(టిప్పణి : వాసు టవున్ ప్లాన్‌లో చూసి పార్కులనుకున్నవి అన్నీ, కొన్ని సంస్థల క్వార్టర్సేగాని పచ్చగడ్డి పార్కులు కావు)